
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 20 మార్చి 2025



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సెహరీ (శుక్రవారం ఉదయం)
కడప	6.31	5.05
ప్రొద్దుటూరు	6.32	5.09

జడ్పీ చైర్మన్ ఎన్నికకు శ్రీకారం

● ఏర్పాట్లపై అధికారుల కసరత్తు

కడప రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా జడ్పీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ బుధవారం నుంచి మొదలైంది. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలతో జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ బుధవారం తన చాంబర్‌లో ఎన్నికల నియమావళిపై సంబంధిత సిబ్బందితో ప్రత్యేకంగా చర్చించారు. గురువారం నుంచి జిల్లాలోని 48 మంది జడ్పీటీసీ సభ్యులను స్వయంగా కలిసి 25వ తేదీ లోపు ఎన్నికల నోటీస్ అందజేసి వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ కార్డును పొందాలని సూచించారు. ఇందుకు ఒక నియోజకవర్గానికి ఒక ఏవోను ఏర్పాటు చేశారు. వీరు ఆయా మండలాల ఎంపీడీవోల ద్వారా జడ్పీటీసీ సభ్యులకు నోటీసు అందజేయనున్నారు. 27వ తేదీ ఉదయం 10 గంటలకు జడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. తరువాత 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 12 గంటలకు చెల్లుబాటయ్యే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. తరువాత చైర్మన్ ఎన్నిక నిర్వహించి పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించి ఎన్నికైన అభ్యర్థితో ప్రమాణస్వీకారం చేయించనున్నారు.

జడ్పీ చైర్మన్ ఎన్నికపై వైసీపీ సమాలోచన



జడ్పీ చైర్మన్ ఎన్నికపై ఉమ్మడి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల వైసీపీ ఇన్‌చార్జిలతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి బుధవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ భేటీకి వైసీపీ జడ్పీ చైర్మన్ అభ్యర్థి బి.మఠం జడ్పీటీసీ సభ్యుడు రామగోవిందరెడ్డి కూడా హాజరయ్యారు. రామగోవిందరెడ్డి ఎన్నికను లాంఛనప్రాయం చేయాలని, ఇందుకు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బాధ్యత తీసుకోవాలని రవీంద్రనాథరెడ్డి సూచించారు. జడ్పీటీసీ సభ్యులందరూ తప్పకుండా ఎన్నికకు హాజరై రామగోవిందరెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరిచేలా చూడాలని పేర్కొన్నట్లు సమాచారం. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి హాజరయ్యారు. కాగా.. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కీలకమైన భేటీని జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ లేకుండానే కొనసాగించడంపై రాజకీయ వర్గాలలో చర్చ సాగుతోంది.

అదే తీరు..!

● వైసీపీ ఫార్ములానే ఇంకా అమలు
● గ్రావెల్, మైనింగ్, ఇసుక దందా
● అక్రమ మైనింగ్‌లో కనీస జాగ్రత్తలు కరువు
● ప్రాణాలు కోల్పోతున్న కూలీలు



కడప నగర శివారులో నానాపల్లె వద్ద కొండలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రూల్స్ గీల్స్ జాంతానయ్ అనేలా సాగింది. ఇసుక, గ్రావెల్, మైనింగ్ తవ్వకాల్లో అప్పట్లో నిబంధనలన్నీ అటకెక్కించారు. మట్టి తవ్వుకున్నా, గ్రావెల్ తవ్వుకున్నా అడిగే నాథుడే లేడు. ఇసుక తవ్వకాలు కేజీఎఫ్ గనుల్లా మారినా పట్టించుకునేవారే లేరు. ఇక మైనింగ్ అంటారా దాని గురించి ఎంత వక్కువ మాట్లాడితే అంత మేలు. కలసపాడు మండలంలో జిలెటిన్ స్టిక్స్ పేలి పదిమంది మృతిచెందారు. అనుమతి లేదంటూ ఆ గనిని సీజ్ చేయగా.. మళ్లీ తవ్వకాలు సాగుతున్నాయి. వైసీపీ హయాంలో ఎలాగైతే సహజవనరులు దోచుకున్నారో అదే ఫార్ములా ఇప్పటికీ నడుస్తుండడం గమనార్హం.

అడ్డగోలు తవ్వకాలు

కడప శివార్లలో గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. లీజులు ఒకచోట అయితే తవ్వకాలు మరోచోట జరుపుతున్నారు. సర్వేనెంబర్ 919/1లో ఓ దేవాలయం వద్ద తవ్వుతున్నారు. రెండురోజుల క్రితం అధికారులు టిప్పర్లను సీజ్ చేశారు. సీకేదిన్నె మండలం నుంచి గ్రావెల్ అడ్డదారుల్లో నొక్కేస్తున్నారు. బ్రహ్మంగారిమఠం మండలం రేకలకుంట వద్ద కొండలను కొట్టేస్తున్నారు. ఇక జాతీయ రహదారి పేరుతో అడ్డగోలుగా మట్టితవ్వకాలు సాగిస్తున్నారు. వీఎస్‌పల్లె, వేంపల్లె, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నుంచి ఇసుక తవ్వకాలకు అడ్డుఅదుపు లేదు.

అధికార పార్టీ అండతో..

పులివెందుల నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోందని చెబుతున్నారు. ఇక్కడ ముగ్గురాయి అక్రమ తవ్వకాలు ఎక్కువగా సాగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండతో ఈ వ్యవహారమంతా సాగుతోంది. పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాలు అక్రమ మైనింగ్‌కు పెట్టింది పేరు. ఆ నాలుగు మండలాల్లో దాదాపు 60 చోట్ల అక్రమ మైనింగ్ సాగుతున్నట్లు తెలిసింది. ముగ్గురాయి తవ్వకాల్లో దాదాపు వంద అడుగుల లోతుకు వెళ్లి కూలీలు పనిచేయాల్సి ఉంటుంది. వారికి ఎలాంటి రక్షణ పరికరాలు సమకూర్చరు. తలకు హెల్మెట్ గాని, గనిలో ఆక్సిజన్ సౌకర్యం గాని, లోపలికి వెళ్లేటపుడు తగిన భద్రత గాని ఉండదు.

మట్టిపెళ్లలు పడి..

వేంపల్లె మండలం కత్తలూరు సమీపంలో ముగ్గురాయి గనిలో తవ్వకాలకు వెళ్లిన నలుగురు కూలీలపై మంగళవారం మట్టిపెళ్లలు విరిరిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఒక కూలీ ప్రాణాలు కోల్పోయాడు. మిగలిన ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఒకవేళ ప్రమాదం ఎదురైనా కూలీలు ప్రాణాలతో బయటపడేందుకు తగిన భద్రతలు కూడా పాటించడం లేదు.

యథేచ్ఛగా జిలెటెన్ స్టిక్స్ వాడకం



వేంపల్లె మండలంలో మంగళవారం ముగ్గురాయి గనిలో మట్టిపెళ్లలు పడి మృతిచెందిన కూలీ

ముగ్గురాయి తవ్వకాలకు వెళ్లే కూలీల ఇళ్లలో జిలెటిన్ స్టిక్స్ అంటే అవి చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మల్లాగా చూస్తుంటారు. వాటిని జాగ్రత్తగా భద్రపరచాలని గాని, ఎవరికి ప్రమాదం లేకుండా బయట గని ప్రాంతంలో భద్రపరచాలనే ధ్యాస వీరికి ఉండదు. ఉదయాన్నే ముగ్గురాయి తవ్వకాలకు వెళ్లేటపుడు ప్లాస్టిక్ బుట్టల్లో జిలెటిన్ స్టిక్స్ పెట్టుకుని ఇంటినుంచి గనికి వెళ్లడం అక్కడ కూలీలకు అలవాటు. జిలెటిన్ స్టిక్స్ ఎంత ఈజీగా వినియోగిస్తారో ఒక ఉదాహరణ చెప్పవచ్చు. వేముల మండలంలోని వి.కొత్తపల్లెలో తమ వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్త మంచం కింద జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చి హత్య చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

50 శాతం స్టైఫండ్ పెంచుతూ జీవో జారీ

● సరిపోదంటున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉపకార వేతనాలను 50 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే ప్రస్తుత ఖర్చులకు అనుగుణంగా ఇది ఏమాత్రం సరిపోదని విద్యార్థులు నిరవధిక సమ్మె కొనసాగించారు. యూజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సమయంలో ప్రస్తుతం నెలకు ఇస్తున్న రూ.7 వేలను రూ.10,500లకు పెంచారు. పీజీ విద్యార్థులకు రూ.9 వేల నుంచి రూ.13,500లకు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో బుధవారం స్థానిక పశువైద్య కళాశాలలోని అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్, ఇతర ప్రొఫెసర్లు విద్యార్థులతో సంప్రదింపులు జరిపారు. సమ్మెను విరమించి తరగతులకు హాజరు కావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉపకార వేతనాలు చెల్లించాలన్న డిమాండ్‌తో గత 44 రోజులుగా తరగతులు బహిష్కరించి కొనసాగించిన సమ్మెపై ప్రభుత్వం స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ప్రస్తుత ఖర్చులకు అనుగుణంగా ఆ మొత్తం సరిపోదని, వైద్య విద్యార్థులతో సమానంగా రూ.25 వేలు, రూ.55 వేలు, రూ.75 వేలు చొప్పున ఉపకార వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాశాలల విద్యార్థులు ఏకనిర్ణయంతో సమ్మె కొనసాగింపు అంశంపై గురువారం ఒక నిర్ణయానికి రానున్నట్లు వివరించారు.



ఆందోళన కొనసాగిస్తున్న పశువైద్య విద్యార్థులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఖాజీపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడినా అప్పులే మిగులుతుండటం, వేసిన బోర్లు ఎండిపోతుండటంతో దిక్కుతోచక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుల కథనం మేరకు.. ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె పంచాయతీ బక్కాయపల్లెకు చెందిన పత్తి రామచంద్రారెడ్డి (40) అనే రైతు కొన్ని సంవత్సరాలుగా సొంత పొలంతో పాటు కౌలుకు తీసుకుని భూమిని సాగు చేసేవాడు. దిగుబడి రాక సొంత పొలంలో బోర్లు వేసి నీళ్లు పడక దాదాపు రూ.15లక్షలు అప్పు చేశాడు. అప్పుల వడ్డీ కట్టలేకపోవడంతో వారు ఒత్తిడి తెచ్చారు. దీంతో మనస్థాపం చెందిన రామచంద్రారెడ్డి మంగళవారం రాత్రి మైదుకూరుకు వెళ్లి పురుగుల మందు తీసుకుని శ్రీనివాసపురం సమీపంలోని తమ పొలం వద్ద మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం ఆ దారిన వెళ్లే రైతు గమనించి వారి బంధువులకు తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని అయ్యోపాపం అంటూ కన్నీరు మున్నీరయ్యారు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రైతు భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మోహన్ తెలిపారు. రైతు ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి బక్కాయిపల్లె గ్రామానికి చేరి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మృతుడు రామచంద్రారెడ్డి (ఫైల్‌ఫొటో)

తండ్రి చనిపోయినా.. పరీక్షకు

రామచంద్రారెడ్డి కూతురు అనిత ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాస్తోంది. బుధవారం ఉదయం నిద్రలేవగానే తండ్రి చనిపోయాడని తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించింది. అక్కడున్న వారంతా ధైర్యం కల్పించడంతో మైదుకూరులోని పరీక్ష కేంద్రానికి వెళ్లి 10వ తరగతి హిందీ పరీక్ష రాసింది.

'పది' పరీక్షల్లో ఒకరు డిబార్

● ఇన్విజిలేటర్ సస్పెన్షన్

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో బుధవారం ఒక విద్యార్థి డిబార్ కాగా.. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశామని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. బుధవారం 10వ తరగతి విద్యార్థులకు హిందీ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 27,671 మంది హాజరుకావాల్సి ఉండగా 27,531 మంది హాజరయ్యారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులకు సంబంధించి పది మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 87 కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి నాలుగు కేంద్రాలను, జిల్లా పరిశీలకులు బి.మధుసూదన్‌రావు ఒక కేంద్రాన్ని పరిశీలించారు. కాగా.. కడప నగరం ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన పరీక్షలకు విద్యార్థి సెల్‌ఫోన్‌తో కేంద్రంలోకి హాజరయ్యారు. విద్యార్థిని తనిఖీ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకోవాల్సిన ఇన్విజిలేటర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. స్క్వాడ్ తనిఖీలో విద్యార్థి వద్ద సెల్‌ఫోన్ దొరకడంతో విద్యార్థిని డిబార్ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్, పెండ్లిమర్రి మండలం జీసీపల్లె హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ప్రకాశ్‌బాబును సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

పట్టపగలు ఏటీఎంలో చోరీకి యత్నం..
ఇద్దరు అరెస్టు
7

కాలగర్భంలోకి కాలజ్ఞానం
● నగరిపాడు రంగనాయక ఆలయంలో ప్రతులు
● శిథిలమవుతున్న తాళపత్ర గ్రంథాలు

మద్యం మత్తులో యువకుడి
హల్‌చల్
7



బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

● డ్వామాలో ఫెవికాల్ వీరులు కదులుతారా.?
● హెచ్‌ఆర్ విభాగంలో అనర్హులదే పెత్తనం

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు నిబంధనలను జారీ చేసింది. ఈ నెల 22 నాటికి పనిచేసే చోట మూడేళ్లు, ఐదేళ్లు పూర్తయిన వారు బదిలీలకు అర్హులని ఆదేశించింది. అనారోగ్యం బారిన పడ్డవారు, దివ్యాంగులు, స్పౌస్ ఉద్యోగుల పేరిట నిబంధనలు విధించింది. దీంతో ఐదేళ్లు, మూడేళ్లు పూర్తిచేసుకున్న ఉద్యోగులు బదిలీల కోసం డ్వామా కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. రెండేళ్ల క్రితమే బదిలీలు జరిగాయి. ఒకేచోట దీర్ఘకాలికంగా పనిచేసేవారిని బదిలీ చేశారు. ఈసారి జిల్లా స్థాయిలో బదిలీలకు అర్హత ఉన్నవారు 50 మంది ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే డ్వామా కార్యాలయంలోనే సుమారు 30 మంది దీర్ఘకాలికంగా పనిచేస్తూ ఫెవికాల్ వీరులుగా మారిపోయారు. మరి ఈసారి బదిలీల్లో వీరిని కదిలిస్తారా అనే చర్చ ఆ శాఖ ఉద్యోగుల్లో నడుస్తోంది.

జిల్లాలో కడప మినహా 35 మండలాలున్నాయి. మొత్తం 562 గ్రామ పంచాయతీలున్నాయి. ఏపీవోలు 35 మంది, ఈసీలు 30 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 250మంది, కంప్యూటరు ఆపరేటర్లు వందమంది, బీఎఫ్‌సీలు 50 మంది వరకు పనిచేస్తున్నారు. వీరిలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేస్తారు. ఐదేళ్లు నిండిన అనారోగ్య, మానసిక రోగాలు, స్పౌస్ ఉద్యోగుల విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కోరుకున్న చోటుకు వెళ్లేందుకు డ్వామా సిబ్బంది స్థానిక నేతలను సిఫారసు లేఖల కోసం ఆశ్రయిస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితమే బదిలీలు జరగడంతో ఈసారి 50 మందికి మించి ఉద్యోగుల బదిలీలు ఉండకపోవచ్చని చెబుతున్నారు.

ఫెవికాల్ వీరులు


డ్వామా కార్యాలయంలో కొన్నేళ్లుగా కంప్యూటరు ఆపరేటర్లు, సీఏలు, ఇతరత్రా పలువురు తిష్టవేశారు. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా వీరు మాత్రం ఇక్కడే ఉంటున్నారు. తప్పనిపరిస్థితుల్లో బదిలీ చేస్తే వేరొక మండలానికి వెళ్లి రెండు నెలల్లోపే డిప్యుటేషన్‌పై మళ్లీ కడపకే వస్తున్నారు. ఈ సారైనా ఫెవికాల్ వీరులకు స్థాన చలనం ఉంటుందా లేదా అనే చర్చ డ్వామా కార్యాలయంలో జరుగుతోంది.

హెచ్‌ఆర్‌లో అనర్హుల పెత్తనం

డ్వామాకు హెచ్‌ఆర్ కీలక విభాగం. ఇక్కడ అనర్హులు పెత్తనం సాగిస్తున్నారని చెబుతున్నారు. ఓ అవుట్ సోర్సింగ్ కంప్యూటరు ఉద్యోగిని ఇన్‌చార్జిగా కొనసాగిస్తున్నారు. ఎలాంటి సీనియారిటీ లేకపోయినా గతంలో పనిచేసిన ఓ అధికారికి షాడో అధికారి అనే పేరుంది. ఈయనకు ఏపీవో బాధ్యతలు కూడా అప్పజెప్పారని అంటున్నారు. ప్రభుత్వం మారినా ఇప్పుడూ ఆయన చక్రం తిప్పుతుండడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఈయన పులివెందుల ప్రాంతంలో వైసీపీ నేతలు తమ బంధువులు అని చెప్పేవారని.. ఇప్పుడు సింహాద్రిపురానికి చెందిన టీడీపీ నేత, ఓ మాజీ జడ్పీటీసీ బంధువు అని చెప్పుకుంటున్నారని సమాచారం. దీనిపై ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు జరిగే బదిలీల్లో కూడా ఆయన చక్రం తిప్పుతున్నారని ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. వైసీపీ హయాంలో చక్రం తిప్పి ఇప్పుడు అదే రేంజ్‌లో హవా కొనసాగడం చూసి గవర్నమెంటు మారింది తప్ప ఈ అధికారి హవా ఏ మాత్రం తగ్గలేదంటూ ఉద్యోగులు అంటున్నారు. బదిలీల విషయంపై డ్వామా పీడీ ఆదిశేషారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం బదిలీలు పారదర్శకంగా చేపడతామన్నారు. ఎంతమంది బదిలీలకు అర్హులనేది గురువారం తెలుస్తుందన్నారు.

మోసాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు

● ఆ పెట్రోల్ బంకులను ఏమాత్రం ఉపేక్షించొద్దు
● నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారు
● యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరించాల్సిందే
● ఇంధన కంపెనీలకు హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసాలపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కిరోసిన్ కలపడం, ఇంధనం తక్కువ పోయడం వంటి చర్యలతో వినియోగదారులను మోసగిస్తున్న రిటైలర్లపై కఠినంగా వ్యవహరించాల్సిందేనని తేల్చిచెప్పింది. పెట్రోల్ తక్కువ ధరకేమీ ఇవ్వడం లేదని, ప్రతీ లీటర్‌కు రూ.100కు పైగా వసూలు చేస్తున్నారని గుర్తుచేసింది. వినియోగదారుల జేబులకు చిల్లుపెడుతున్న పెట్రోల్ బంకు యాజమాన్యాలకు నామమాత్రపు జరిమానాలు విధిస్తూ సరిపెడుతున్నారని, వారిని ఏమాత్రం ఉపేక్షించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మోసాలకు పాల్పడుతూ పట్టుబడిన రిటైలర్ల లైసెన్స్‌లు వెంటనే రద్దు చేయాలని తేల్చి చెప్పింది. వైఎస్సార్ కడప జిల్లా, తిరుపతి జిల్లాలలో రెండు పెట్రోల్ బంకుల మోసాలకు సంబంధించి హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వాస్తవాలు చెప్పకుండా దాచిపెట్టడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అన్ని వివరాలతో సమగ్రంగా అఫిడవిట్ దాఖలు చేయాలని హెచ్‌పీసీఎల్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కడప అరవింద్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న తేజ ఫిల్లింగ్ స్టేషన్, తిరుపతి రేణిగుంట రోడ్డులోని శెట్టిపల్లి వద్ద ఉన్న తేజ సర్వీస్ స్టేషన్ మోసాలకు పాల్పడుతున్నా హెచ్‌పీసీఎల్ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పేర్కొంటూ కడప జిల్లా ఖాజీపేట గ్రామానికి చెందిన వెంకట మహేశ్వర్‌రెడ్డి 2024లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది మేడపాటి సంతోష్‌రెడ్డి వాదనలు వినిపించారు. హెచ్‌పీసీఎల్ వేసిన కౌంటర్‌లో పెట్రోల్ బంకులపై ఉన్న ఆరోపణలు, వాటిపై ఉన్న కేసులు, తీసుకున్న చర్యల గురించి పూర్తి వివరాలు ప్రస్తావించలేదని కోర్టుకు విన్నవించారు. హెచ్‌పీసీఎల్ తరపు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకున్నామని, రూ.70వేలు జరిమానా విధించామని చెప్పారు. ఈ వివరణను ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. రిటైలర్లతో ఇంధన కంపెనీలు కుమ్మక్కయినట్లు కనపడుతోందని వ్యాఖ్యానించింది. మోసాలకు పాల్పడుతున్న పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు నామమాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపుకోవడం సరికాదని పేర్కొంది. వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని స్పష్టం చేసింది. సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని హెచ్‌పీసీఎల్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఉపసర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

కడప రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. 23న నోటిఫికేషన్ జారీచేసి 27న ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం, సింహాద్రిపురం మండలంలోని అంకాలమ్మ గూడూరు, సీకేదిన్నె మండలంలోని బుసిరెడ్డిపల్లె, కమలాపురం మండలంలోని కోగటం, బి.మఠం మండలంలోని గొడ్డవీడు, యర్రగుంట్ల మండలంలోని చిర్రాజుపల్లె, దువ్వూరు మండలంలోని ఇడమడక, చెన్నూరు మండలంలోని ముండ్లపల్లె పంచాయతీలలో ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అదనపు జిల్లా ఎన్నికల అధికారి (డీపీవో) జిల్లాలో ఖాళీగా ఉన్న తొమ్మిది ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

కాలగర్భంలోకి.. కాలజ్ఞానం!

- నగరిపాడు రంగనాయక ఆలయంలో ప్రతులు
- శిథిలమవుతున్న తాళపత్ర గ్రంథాలు
- ఏడాదికోసారి ప్రదర్శన
- చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతి

మహనీయుడొక్కడు పుట్టేనయా...
మత భేదములు లేకుండ చేసేనయా...
చెడ్డవాని చేతిలో సచ్చేనయా...
సిద్ధ శివ గోవిందా గోవిందా..
హరి గోవిందా గోవిందా...
రమణీ యొక్కటి పుట్టు..
రాజ్యమును పాలించు...
పేదలను ఎక్కించు..
రాజులను దింపించు...
ఆకాశమునందు రక్తమై కనిపించు...
సిద్ధ శివ గోవిందా గోవిందా..
హరిగోవింద.. గోవిందా... అంటూ 17వ శతాబ్దంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞాన ప్రతులు చిట్వేలి మండలం నగరిపాడు గ్రామంలోని శ్రీ రంగనాయస్వామి ఆలయంలో ఉన్నాయి.





అగ్నిగుండంలో లభించిన దండం, కాలజ్ఞానం గ్రంథం, శిథిలమైపోతున్న కాలజ్ఞాన గ్రంథంలోని తాళపత్రాలు

రాంజపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రజలనే మేలుకొల్పిన బ్రహ్మంగారి కాలజ్ఞాన ప్రతులకు రక్షణ కరవైంది. ఈ గ్రంథ ప్రతులు కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంతోపాటు సిద్దయ్య మఠం, నంద్యాల జిల్లా బనగానపల్లెలోని గరిమిరెడ్డి అచ్చమ్మ ఆలయంలో, అన్నమయ్య జిల్లా నగరిపాడు రంగనాయక ఆలయంలోను ఉన్నాయి. ఈ ఆలయంలో ఉన్న ప్రతులకు ఎటువంటి రక్షణా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని ఆలయ కమిటీ ఓ పెట్టెలో భద్రపరిచి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రదర్శిస్తోంది.

కుల రహిత సమాజం కోసం..

వీరబ్రహ్మేంద్రస్వామి లవారు రచించిన కాలజ్ఞాన ప్రతులు నగరిపాడు రంగనాయక ఆలయానికి ఎందుకు చేరాయన డానికి స్థానికంగా ఓ కథ ప్రచారం లో ఉంది. 17వ శతాబ్దంలో చిట్వేలి మండలం నగిరిపాడుకు చెందిన జగ్గరాజు, జగ్గమ్మ దంపతులకు బ్రహ్మంగారి వరప్రసాదంగా శ్రీ రంగనాయకస్వామి జన్మించారు. చిన్నతనంలోనే రంగరాజు దేశాటన చేస్తూ బ్రహ్మంగారి ఆలయానికి చేరాడు. అక్కడ బ్రహ్మంగారి మనవరాలు ఈశ్వరమ్మ పట్ల ఆకర్షితుడ య్యాడు. అయితే, కులాంతర వివాహన్ని ఈశ్వరమ్మ తండ్రి గోవిందయ్య, పిన తండ్రి పోతులూరయ్య వ్యతిరేకించారు. తాను బ్రహ్మంగారి వరపుత్రుడినని, తన మనుమరాలైన ఈశ్వరమ్మను పెళ్లి చేసుకోవాలని ఆయన ఆజ్ఞాపించారని, లేదంటే జీవ సమాధి అవుతానని చెప్పారట. అక్కడి పెద్దలు, బ్రహ్మంగారి కు మారులు దీనిపై ఆలోచించి బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞాన ప్రతులను పరిశీలించి అందులో ఈ ప్రస్తావన ఉంటే వివాహం చేస్తామని చెప్పారట. దీంతో బనగానపల్లెకు వెళ్లి గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంటి ముంగిట చింతచెట్టు వద్ద భూమిలో దాచి ఉంచిన కాలజ్ఞాన ప్రతుల్లో మూడింటిని వెలికితీసి వాటితో కందిమల్లాయపల్లెకు వచ్చాడట. ఆ ప్రతులను పరిశీలించగా ఈ జన్మలో శ్రీ రంగరాజుకు, ఈశ్వరమ్మకు పెళ్లి యోగం లేదని, కులాంతర వ్యవస్థ నశించే వరకు ఈ పెళ్లి జరగదని రాసి ఉందట. అంతవరకు శ్రీరంగరాజు, ఈశ్వరమ్మ జీవ సమాధి కావాలని, కుల రహిత సమాజం ఏర్పడిన తర్వాత పునర్జన్మించి వివాహమాడుతారని అందులో ఉందట. ఆ ప్రకారం ఈశ్వరమ్మ బ్రహ్మంగారి జీవ సమాధి పక్కనే సజీవ సమాధి కాగా, రంగరాజు నగరిపాడులోని తన స్వగ్రామంలో అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం చేశాడని చెబుతుంటారు. అగ్నిగుండం ఆరిపోయిన తర్వాత ఆ బూడిదలో బయటపడిన పాదుకలు, యోగదండం, శిఖాముద్రికలు బయటకు తీసి పూజలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రంగనాయక ఆలయం నిర్మించారు. ఆయన ఆనాడు తీసుకువచ్చిన మూడు ప్రతుల్లో 2 కందిమల్లాయపల్లెలో ఉంచి ఒక ప్రతిని నగిరిపాడులోని రంగనాయకుల ఆలయంలో భద్రపరిచారు. రంగరాజు 1692లో జన్మించగా ఫిబ్రవరి 21, 1717లో జీవ సమాధి అయ్యారు.



నగరిపాడు ఆలయంలోని రంగనాయకస్వామి మూలవిరాట్

కాలజ్ఞాన ప్రతులను ప్రచురించాలి



కాలజ్ఞాన ప్రతులకు తగిన భద్రత లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలజ్ఞాన ప్రతులతో పాటు రంగరాజు పాదుకలు, యోగదండం, శిఖా ముద్రికలకు అధికారులు రక్షణ కల్పించాలి. ఈ కాలజ్ఞాన ప్రతులను ముద్రించాలి.

- పోలిన నాగేశ్వర నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్, నగిరిపాడు

కాలజ్ఞాన ప్రతులకే దిక్కులేకపోతే ఎలా ?



భూత భవిష్యత్ వర్తమానాలకు సంబంధించిన కాలజ్ఞాన ప్రతులను ఇంత వరకు అధికారులు కాని, జిల్లా అధికార యంత్రాంగం కాని పరిశీలించలేదు. దీంతో ఈ గ్రంథంలోని తాళపత్రాలు రోజు రోజుకు శిథిలమైపోతున్నాయి.

- పాటూరు సుబ్బరామిరెడ్డి, నగిరిపాడు గ్రామం, చిట్వేలి

పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పూర్తయిన పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ఇస్తున్న అదనపు ఆర్థిక సాయం లబ్ధి దారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆయన అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ సిబ్బంది తదితరులతో పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలు, రీసర్వే, ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్, పల్లె పండుగ కార్యక్రమాలు, ఎన్టీఆర్ హౌసింగ్, పీ4 సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 17 రకాల అంశాలను ఆధారంగా చేసుకొని అనర్హులను తీసివేయాలన్నారు. అర్హులకు మాత్రమే ఇళ్ల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పల్లె పండుగ కింద దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయని ఎంపీడీవోలు అందరూ మంచి పురోగతి సాధించారని అభినందించారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో పూర్తయిన పల్లెపండుగ నిర్మాణాలను ఉగాది రోజున ప్రారంభించాలని సూచించారు. ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకొని, ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మతో కలిసి మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం గుర్తింపునిచ్చిన అధ్యయన కేంద్రాల్లో ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంకామ్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఏదేని డిగ్రీ పాసైతే చాలన్నారు. ఈ ఏడాది నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ ఆనర్స్) మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభించామన్నారు. ఈకోర్సులో ప్రవేశానికి ఇంటర్, సమాన అర్హతగల వారు ప్రవేశానికి అర్హులన్నారు. ఇతర వివ రాలకు హెచ్‌టీటీపీఎస్:// సీఓడీఈ. వైవీయూ.ఈడీయు.ఐఎన్‌ను సంప్రదించాలన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

- ఫ్యాక్షన్‌జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి



మాట్లాడుతున్న సీఐ రమణారెడ్డి, హాజరైన విద్యార్థులు

కడప క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీకేదిన్నె పీఎస్ పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రుల కలలను కల్లలు చేస్తున్నారన్నారు. మత్తు పదార్థాలకు బానసలైతే విచక్షణాశక్తిని కోల్పోయి.. ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సీకేదిన్నె సీఐ శంకరనాయక్ మాట్లాడుతూ కళాశాల సమీప ప్రాంతాల్లో కానీ, చుట్టుపక్కల కానీ ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి, హెచ్ఓడీ శశికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నేతలు

జమ్మలమడుగు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వెంటనే విరమించుకోవాలని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, కూటమి ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అర్బన్ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి సీఐ గోపాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది నిరసన చేస్తున్న వారిని అడ్డుకొని అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు కమిటీ ప్రణయ్‌కుమార్, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉపకులపతి విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కళాశాల వార్షికోత్సవం, వ్యవస్థాపక దినోత్సం సందర్భంగా బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్, కుల సచివులు ఎస్.రాజేష్ కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టీఎస్ ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆచార్య జి.విశ్వనాథ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఉత్సాహపూరితమైన వాతావరణంలో వర్సిటీలోని అన్ని విభాగాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన కబడ్డీ పోటీలలో ఆర్కిటెక్చర్ విభాగపు విద్యార్థులపై స్కాల్ప్చర్ విభాగం విద్యార్థులు విజయం సాధించారు. అలాగే క్రికెట్ పోటీలలో అప్లైడ్ ఆర్ట్ విభాగంపై ఆర్కిటెక్చర్ విద్యార్థులు విజయం సాధించారు. గెలుపొందిన జట్లను వర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు.

హత్యాయత్నం కేసులో వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అరెస్టు

సీకేదిన్నె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో కమలాపురం వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గోవిందు విజేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డిపల్లె గ్రామంలో బావి వద్ద చెట్లు కొట్టుకునే విషయమై గజ్జల మల్లికార్జునరెడ్డి, చెన్నూరు నాగమల్లారెడ్డి కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో నాగమల్లారెడ్డి బంధువైన కమలాపురం మండలం పాచికలపాడు గ్రామానికి చెందిన విజేందర్‌రెడ్డి తన ఐదుగురు అనుచరులతో 2024 జనవరి 29న మల్లి కార్జునరెడ్డిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసులో నాగమల్లారెడ్డి, అతని భార్య రాజమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ అండదండలతో విజేందర్‌రెడ్డిని కేసు నుంచి తప్పించారు. అయితే ప్రస్తుతం అతనిపై మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పోలీసు స్టేషన్‌కు వచ్చి విజేందర్‌రెడ్డిని పరామర్శించారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

- ఐదుగురు మహిళలకు గాయాలు



పోలీసుల అదుపులో ఉన్న యువకుడు

బద్వేలుటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేసి మహిళలను గాయపరిచిన ఘటన బద్వేలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని ఎగువ బ్రాహ్మణవీధికి చెందిన చరణ్ అనే యువకుడు బుధవారం రాత్రి మద్యం సేవించి ఎగువ బ్రాహ్మణవీధి నుంచి నాగులకట్ట చెరువువైపు ద్విచక్రవాహనం వేగంగా వెళుతుండగా.. అక్కడే ఉన్న మహిళలు నెమ్మదిగా వెళ్లమన్నారు. దీంతో ఆ యువకుడు ఆగ్రహానికిలోనై మహిళలను బూతులు తిడుతూ వారి కాళ్లను చేతులను విచక్షణా రహితంగా కొరికాడు. దీంతో రమణమ్మ, కుమారి, శ్రావణితో పాటు మరో ఇద్దరికి గాయాలు కాగా.. పోలీసులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు యువకుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

సచివాలయ ఏఎన్‌యం మృతి

పెండ్లిమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచునూరు సచివాలయ ఏఎన్ఎంగా పనిచేస్తున్న జ్యోతి (30) గత కొద్ది రోజు లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండేది. ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. సచివాలయ, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది నివాళులు అర్పించారు.

ఒంటిమిట్టను టూరిజం హబ్‌గా చేయడం శుభపరిణామం

టీడీపీ సీనియర్ నేత మోదుగుల పెంచలయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు మోదుగుల పెంచలయ్య, కొమరా వెంకటనరసయ్య

రాజంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టను ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు టూరిజం హబ్‌గా చేయడం శుభ పరిణామమని టీడీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్యలు పేర్కొన్నారు. బుధవారం ఒంటిమిట్టలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడుతూ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వ ప్రసాద ప్రోగ్రాం కింద ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని తెలపడం ఆనందదాయకమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రూ.వంద కోట్లతో ఒంటిమిట్ట అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేశారన్నారు. అయితే గత జగన్ ప్రభుత్వంలో నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి.. చెరువుకు నీరందించి బోటు షికారుతో పాటు ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామనడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు వెంకటరమణ, మోదుగుల నరసింహులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

కమలాపురం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పని కావాలని కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికా రులపై ఉందని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గోపులాపురం సమీపంలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న ఫారం పండ్ పనిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తమ పొలంలో ఫారం పాండ్ పనులు చేసుకోవడం వల్ల వర్షపు నీటిని భూమిలోకి రీచార్జ్ చేయవచ్చన్నారు. అత్యవసర సమయంలో ఆ నీటిని ఉపయోగించుకోవచ్చన్నారు. అనంతరం రైతులు నాటుకున్న చీనీ మొక్కలను పరిశీలించారు. గోపులాపురం వెళ్లేదారిలో ఉపాధి పథకం కింద కాల్వ పనిని పరిశీలించి.. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఎంపీడీవో జ్యోతి, ఏపీవో పార్థసారధి, జేఈ ఉపేంద్రారెడ్డి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

సింహాద్రిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ దినేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒక కిలో వాట్‌కు డెవలప్మెంట్ చార్జీలు మునుపు రూ.2000లు కాగా ప్రస్తుతం 50 శాతం రాయితీతో రూ.1000లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో గానీ, విద్యుత్ ఉప కేంద్రం లోని అధికారులను కలసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాగా సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎలాంటి మార్పు వుండద న్నారు. కిలో వాట్‌కు రూ.200లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పట్టపగలు ఏటీఎంలో చోరీకి యత్నం... ఇద్దరు అరెస్టు



ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగలతో సీఐ, పోలీసులు

ఎర్రగుంట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల వేంపల్లిరోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకుకు చెందిన ఏటీఎంలో పట్టపగలు చోరీకి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం సాయంత్రం సీఐ నరేష్‌బాబు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజుపాలెం మండలంలోని తొండలదిన్నెకు చెందిన కొత్తమాసి సుధీకర్ 2020 నుంచి సెక్యూర్ వ్యాల్యూ కంపెనీలో ఏటీఎంలలో డబ్బులు లోడ్ చేసే ఉద్యోగం చేసేవాడు. చెడు వెసనాలకులోనైన సుధీకర్ అప్పుడప్పుడు నగదును చోరీ చేస్తూ సుమారు రూ.36లక్షల వరకు చోరీ చేశాడు. దొంగిలించిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ వారు దొంగిలించిన డబ్బులను రికవరీ చేసి.. అతనిని విధుల నుంచి తొలగించారు. దీంతో అప్పులు కావడంతోపాటు తిరిగి అప్పులు పుట్టకపోవడంతో ఎలాగైనా డబ్బులు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఎర్రగుంట్ల వేంపల్లిరోడ్డులో మూసివేసిన ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎంలో చోరీ చేసేందుకు నిర్ణయించుకున్నాడు. గతంలో ఏటీఎంలో డబ్బులు పెట్టేవాడు కాబట్టి ఎవరికి అనుమానం రాదనుకున్నాడు. తనకు స్నేహితుడు, వెల్డింగ్ పనిచేసే తొండలదిన్నెకు చెందిన గాలిపోతుల అభిషేకంతో తన పథకం చెప్పాడు. ఇద్దరూ కలిసి నంద్యాలకు వెళ్లి గ్యాస్ సిలిండర్, కట్టర్‌ను కారులో తీసుకువచ్చి 17వ తేదీ మధ్యాహ్నం 1.50గంటలకు మూసివున్న ఏటీఎం షెట్టర్ తీసి లోపలికి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేశాడు. అయితే డబ్బు ఉన్న బాక్స్ ఎంత ప్రయత్నించినా తెరచుకోలేదు. అప్పటికే చాలా సేపు కావడంతో ఎవరైనా వస్తారేమోనని భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈవిషయం తెలుసుకున్న ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. 19వ తేదీ మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఎర్రగుంట్ల వై.జంక్షన్ వద్ద ఇద్దరిని అరెస్టు చేసి.. కారు, ఆక్సిజన్ సిలిండర్, గ్యాస్ కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు గురుశంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నేటి నుంచి చౌడేశ్వరిదేవి జ్యోతి వార్షికోత్సవాలు

కడప మారుతీనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నగర ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానం జ్యోతి వార్షికోత్సవాలు ఈ నెల 20వతేదీ గురువారం నుంచి 24 సోమవారం వరకు జరగనున్నట్లు ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్యా సుధాకర్ వెల్లడించారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20న అమ్మవారికి అలంకారం, ఉదయం పంచామృతాభిషేకం అనంతరం గంగమ్మ అమ్మవారికి చల్ల కార్యక్రమం ఉంటుందన్నారు. 21న శుక్రవారం ఉదయం 6.30గంటలకు చౌడేశ్వరిదేవి, గంగమ్మతల్లికి 108 మంది ముత్తయిదువులతో జలాభిషేకం, సాయంత్రం అమ్మవారికి గాజుల అలంకారం, 22న శనివారం అమ్మవారికి పంచామృతాభిషేకం, 23న ఆదివారం ఉదయం 7.30కు గంగమ్మవారికి బోనాలు, తదుపరి 10గంటలకు బిందెసేవ కలశ పూజ, మధ్యాహ్నం3 గంటలకు,చౌడేశ్వరిదేవికి బోనాలు, రాత్రి 9గంటలకు జ్యోతి ప్రజ్వలనతోజ్యోతులతో అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. అనంతరం 24న సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అనంతరం 30న ఆదివారం ఉగాది పర్వదిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

నేడు కులవృత్తులు, కళాకారులతో సమావేశం

చెన్నూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదరణ పథకం కింద కులవృత్తులు చేసుకునేవారికి, కళాకారులుగా ఉన్న వారికి ప్రభుత్వం అవసరమైన పనిముట్లను అందిస్తుందని, దీని కోసం 20వతేదీ గురువారం మండల పరిషత్ సభాభవనంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో మండలవ్యాప్తంగా ఉన్న కులవృత్తులు చేసుకునేవారు, కళాకారులు హాజరు కావాలని ఆయన తెలిపారు. అలాగే ఎవరెవరు ఎలాంటి కులవృత్తులు చేపడుతున్నారో వారి వివరాలు తెలుసుకుని ఎంపిక చేయడం జరుగుతుందని వారికి ఆదరణ పనిముట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలంలో గురువారం కులసంఘాలు, కళాకారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. మండల అభివృద్ధి కేంద్రంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఆదరణ పనిముట్లకు సంబంధించి ఈ సమావేశంలో కులవృత్తులవారికి, కళాకారులకు వివరించి పనిముట్లను రిజిస్టర్ చేసుకొనేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

కడప నాగరాజుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు దృష్టిలో పెట్టుకొని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ బి.శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలియజేస్తూ కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్మికుల పనిగంటల్లో మార్పు చేయాలన్నారు. పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ, వసతి కల్పించాలని కోరారు. వైద్య సిబ్బందితో సమయం చూసుకొని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు సమకూర్చుకోవాలని చెప్పారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు బహిరంగ కార్మికుల పనివేళలు మార్పు చేయాలని, డీహైడ్రేషన్ నివారణ మార్గాలను అవగాహన కల్పించాలని ఆదేశించారు.

'అంబేడ్కర్ భవనం అభివృద్ధిపై నిర్లక్ష్యం ఎందుకు..?'

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ పరిధిలో నిర్మించిన అంబేడ్కర్ భవనంపై ప్రభుత్వాలు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయని, అధికారులు కూడా ఆ భవనం వైపు తొంగి చూడడం లేదని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్దన్, అఖిలభారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రిమ్స్ పరిధిలోని అంబేడ్కర్ భవనాన్ని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. వారు మాట్లాడుతూ 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌తో నిర్మించిన అంబేడ్కర్ భవనం ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, నగిలి రాజేంద్రప్రసాద్, హరిత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం తిలక్‌నగర్

● మురుగునీటి దుర్గంధం ● పందుల స్వైరవిహారం

కడప(వినాయకనగర్), మార్చి19(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్ తిలక్‌నగర్‌లో ఏర్పడి దాదాపు 25 సంవత్సరాలు పూర్తి కావస్తోంది. ఇక్కడ దాదాపు 800 మంది జనాభా ఉన్నారు. ఇప్పటికీ మౌలిక వసతులకు దూరంగానే ఉన్నారు. డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. అరకొరగా వేసిన సిమెంట్ రోడ్లతో స్థానికులు సతమతమవుతున్నారు. పురాతన కాలం నుంచి ఉన్న వంక నార్వల నుంచి వస్తున్న మురుగునీటితో దోమల బెడద అధికంగా ఉంది. ఇటు పందులు అటు విషపురుగులతో సహజీవనం కొనసాగించే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అంటున్నారు. వీధిలైట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.



రోడ్లపైకి చేరిన మురుగునీరు, సిమెంటు రోడ్లు లేని అంబేడ్కర్ కాలనీ

సిమెంటు రోడ్లు నిర్మించాలి

ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ కాలనీకి సిమెంటు రోడ్లు నిర్మించాలి. వర్షం వస్తే చాలా ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయాల్లో రోడ్లపై తిరగాలంటే భయంగా ఉంది.

గువ్వల నాగేంద్ర,స్థానికుడు

డ్రైనేజీ కాలువలు నిర్మించాలి

డ్రైనేజీ కాలువ లేక వర్షం నీరు, మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దోమలు అధికంగా ఉన్నాయి. చిన్నపిల్లలకు విషజ్వరాలు వస్తున్నాయి. పందుల స్వైర విహారం చేస్తున్నాయి. సంబంధించిన అధికారులు వెంటనే స్పందించాలి.

కైపు సుబ్బమ్మ

'మద్దతు ధర లేదు...విత్తన సరఫరా లేదు'



మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర లేదు విత్తన సరఫరా లేదని వైసీపీ జిల్లా అధ్యక్షులు ప.రవీంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందని విమర్శించారు. బుధవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 70శాతం మంది వ్యవసాయంపై ఆధారపడ్డారని అన్నదాత సుఖీభవ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. పంట ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా రైతులను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రైతులు, ప్రజలు అంతా గమనిస్తున్నారని తగిన సమయంలో ప్రభుత్వానికి బుద్ధిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, బాలయ్య, ఆనగేంద్ర, ఇలియాస్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న తులసిరెడ్డి

వేంపల్లె,మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ఐదు మండలాలకు కేంద్రంగా ఉన్న నూతన ఆర్టీసీ బస్టాండ్ ఐదు నెలలు అవుతున్నా ప్రారంభించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. వెంటనే ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.2.20కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బస్టాండ్ వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి ధర్నా చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, చెన్నకేశవ, రవి, ఉత్తన్న, అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. కాగా ఆర్టీసీ బస్టాండ్ విషయంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో తులసిరెడ్డి ఫోన్‌లో మాట్లాడారు.

వైసీపీ నుంచి 18 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పులివెందుల టౌన్ , మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల మున్సిపాలిటీలోని రాజారెడ్డికాలనీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ టీడీపీ నాయకులు రాష్ట్రకార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, షేక్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి సమక్షంలో బుధవారం టీడీపీలో సురేంద్రనాథరెడ్డి, అమర్‌నాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, మరో 18 కుటుంబాలు చేరారు. ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్‌రవి) వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నల్లగారి భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ పుణ్యకార్యం

కడప మారుతీనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం మహా పుణ్యకార్యమని సంఘ సేవకుడు సలావుద్దీన్ పేర్కొన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని బుధవారం కడప నగరంలోని రవీంద్రనగర్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సలావుద్దీన్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ సెంటర్లు

ఎంపీడీవో రఘురాం

వల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. రెండురోజుల పాటు ఒక్కో గ్రామ పంచాయతీలో ఈ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పుట్టిన బిడ్డల నుంచి ఏదైనా సవరణ ఉన్నా క్యాంపుల్లో అటు తల్లిదండ్రులతో పాటు తమ పిల్లలను తీసుకెళ్లి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. 19, 20 వల్లూరు, 21, 22 తేదీల్లో తప్పెట్ల, 25, 26 తేదీల్లో దుగ్గాయపల్లె, 27, 28 లేబాక సచివాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు ఈ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తామన్నారు.

మినీ గోకులాల బిల్లులకు మోక్షం

పెండ్లిమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):గత తెలుగుదేశం 2014-19 ప్రభుత్వ హయాంలో మండలానికి 43 మినీ గోకులాలు మంజూరైనాయి.అప్పట్లో రైతులు ఈ గోశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. రైతు వాటాగా 18వేలరూపాయలు చెల్లించి నిర్మాణాలు పూర్తిచేయడం జరిగింది. అప్పుడు కొద్ది మేర బిల్లులు రాగా,వైసీపీ ప్రభుత్వం రావడంతో బిల్లులు నిలిచి పోయాయి.మరలా టీడీపీ ప్రభుత్వం రావడం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి చొరవతో రావాల్సిన బకాయిలకు నిధులు వచ్చాయని, మార్చి చివరి నాటికి రైతులకు చెల్లించడం జరుగుతుదని మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు.

రైతులకు పీవీసీ పైపులు

ఏఓ రమేష్

లింగాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాడా నిధులతో 2023-24లో రాయితీ పైపుల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు త్వరలోనే పీవీసీ పైపులు అందనున్నాయని ఏఓ రమేష్ తెలిపారు. మండలంలోని పార్నపల్లె, వెలిదండ్ల రైతు సేవా కేంద్రాలలో బుధవారం రైతులతో ఆయన మాట్లాడుతూ అప్పట్లో రైతులు రెండు, రెండున్నర, మూడు, నాలుగు ఇంచుల పైపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇపుడు ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎమ్ పథకం కింద రాయితీ గరిష్టంగా రూ.15,000 ఇవ్వడం జరుగుతుందని, రాయితీ తక్కువగా ఉందని రైతులు రెండు ఇంచుల పైపులు తీసుకుంటే నష్టపోరని తెలిపారు. అపుడు చెల్లించిన డీడీలను ఆమోదించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు మళ్లీ చేసుకోవాలని తెలిపారు.

చెత్తను సంపదగా మార్చాలి

ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు



చెత్త సేకరణపై మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు

చెన్నూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చెత్తను సంపదగా మార్చాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బలసింగాయపల్లె గ్రామ పంచాయతీలోని సచివాలయంలో అక్కడ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. అలాగే గ్రామంలో ఇంటింటాతిరిగి ప్రజలకు కూడా అదే సమయంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డి సురేశ్ బాబు, పంచాయతీ కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌కాలనీలో దాహం కేకలు..!

ట్యాంకర్ల కోసం ప్రజల ఎదురుచూపులు

వేంపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో నీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పాపాఘ్ని నదిలోని ఫిల్టర్లు, పట్టణంలోని బోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో ప్రజలందరికీ నీటి సమస్య ఉంది. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ఇబ్బందిపడుతున్నారు. రాజీవ్‌నగర్ కాలనీలోని పైప్రాంతంలో పది రోజులుగా నీటికి ఇబ్బందిపడుతున్నారు. సొంత ఖర్చుతో ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటుండగా నీటి సమస్య ఉందని వేంపల్లెలో నీటి కటకట అంటూ ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీంతో నాయకులు స్పందిస్తున్నారు. బుధవారం టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ రాజీవ్‌కాలనీలోకి నాలుగు ట్యాంకర్ల నీటిని పంపించారు. మాజీ ఎంపీటీసీ మూడు, టీడీపీ నాయకుడు విజయభాస్కర్ రెండు ట్యాంకర్లు పంపించారు. ఇప్పటి వరకు సొంత ఖర్చుతో తెచ్చుకుంటున్న ప్రజలు నాయకులు పంపిన నీటిని క్యూలో ఉండి పట్టుకున్నారు. కానీ ఒకటి, రెండు రోజులు నాయకులు సొంత ఖర్చుతో సరఫరా చేస్తారు. మళ్లీ సొంతంగా కొనుక్కోవాల్సిందే కదా. దీంకి పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి ప్రభుత్వం ద్వారా నీటి ఎద్దడి ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి ప్రస్తుతానికి సమస్యను పరిష్కరించాలి. ఇక కొత్త బోర్లను వేసి నీటికి శాశ్వత పరిష్కార మార్గం చూపాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.





సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అంతరిక్ష పరిశోధన నిమిత్తం నాసా పరిశోధన కేంద్రం నుంచి నింగిలోకి వెళ్లిన కొన్ని సాంకేతిక కారణాల వల్ల నింగిలోనే ఆగిపోయినప్పటికీ తొమ్మిది నెలలు పాటు అక్కడే ఉండి, నేడు భూమి మీదకు సురక్షితంగా దిగిన సునీత విలియమ్స్ సాహసాన్ని మహిళా లోకం ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని జనసేన నాయకులు జీవీ రమణ, మాలే శివ, సాయి గజ్జల కోరారు. బుధవారం శంకరాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు.

ప్రతి విద్యార్థి లక్ష్యం కలిగి ఉండాలి



పూర్వ విద్యార్థి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ అధికారి చందును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని కలిగి ఉండాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ చందు పేర్కొన్నారు. బుధవారం కడప నగరం శిల్పారామంలో శ్రీహరి డిగ్రీ అండ్ పీజీ కళాశాల 15వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ కళాశాల పూర్వ విద్యార్థి ప్రస్తుతం అసిస్టెంట్ కమి షనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ అధికారి చందు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరంలో చేరిపుడే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అడుగులు వేయడం జరిగింద న్నారు. అనంతరం చిత్తూరు జిల్లా విద్యా సంస్థల అధినేత తేజ మూర్తి, అర్చన డిగ్రీ కళాశాల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల అధినేత విజయ భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. వారిని కళాశాల కరస్పాండెంట్ జి.సుబ్బారెడ్డి సత్కరించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప కలెక్టరేట్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్ర తి వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జావీద్ పేర్కొన్నారు. బుధవారం ఏపీ ప్రభు త్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు జరిగింది. అనంతరం ట్రాఫిక్ నిబంధనల తో కూడిన ఫ్లెక్సీని సీఐ జావీద్, సంఘం నాయకులు రామ్మూర్తి నాయుడు, నగేష్, రాయల రషీద్ సంఘం అధ్యక్షుడు రాయల్ కరీముల్లా విడుదల చేశారు. ఈకార్యక్రమంలో పెన్షనర్లు సుబ్బరాయుడు, బాలయ్య, వీరన్న, నారాయణ, నాగయ్య, నాగ మునీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ రమణారెడ్డి

సీకేదిన్నె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు.యువత క్షణికావేశంలో వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అలా జరుగకుండా నివారించేందుకే పోలీసు శాఖ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందన్నారు. సీకే దిన్నె సీఐ శంకర్‌నాయక్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడి డబ్బులకోసం నేరాలు, హత్యలు చేసేందుకు వెనుకాడటంలేదని యువత సన్మార్గంలో నడిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో బుధవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని మహాత్మాసర్కిల్ సమీపంలో ముద్దనూరు రోడ్డు నుంచి బైకులో ఇద్దరు వ్యక్తులు పట్టణంలోకి వస్తున్నారు. ఈ సమయంలో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో డివైడర్‌పై ఉన్న ఇనుపచువ్వ బైకుపై వెనుక కూర్చున్న పులివెందులకు చెందిన వెంగగురుడు అనే వ్యక్తి దవడలోకి గుచ్చుకోగా తీవ్ర రక్తస్రావం జరిగినట్లు చెబుతున్నారు. హుటాహుటిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. అలాగే సాయంత్రం 6.10గంటల ప్రాంతంలో పట్టణ పరిధిలోని కోతిసమాధి సమీపంలో బైకుపై వెళ్తున్న పులివెందులకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్ర గాయాలై చెవుల నుంచి రక్తస్రావం అవుతున్నట్లు చెబుతున్నారు. ఇతనిని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపరిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ రెండు ప్రమాదాలపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలకోసం దర్యాప్తు చేస్తున్నట్లు పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తెలిపారు.

వల్లూరు..: కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో మండల పరిధిలోని గోటూరు పెట్రోలు బంకు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలై మరో ఇద్దరుకి స్వల్పగాయాలైనట్లు పోలీసులు స్థానికులు తెలిపారు. వల్లూరు నుంచి కడపకు ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న జావీదు, కడప నుంచి కమలాపురం వెళుతున్న సాదక్ ఎదురెదురుగా ఢీకొనడం జరిగిందని, దీంతో ఆ ఇరువురికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను 108లో కడప రిమ్స్‌కు తలరించినట్లు తెలిపారు. అయితే సాదక్ పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలిసింది.

అలంకారప్రాయంగా వాటర్‌ట్యాంకు



కమలాపురం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు కార్యాలయ విలేజీ క్లినిక్ వద్ద ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకు నిరు పయోగంగా ఉంది. వేల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసినా గత పాలకులు దాన్ని అమలు లోకి తేలేక పోయారు. ప్రస్తుతం దీని సమీపంలోని తహసీల్దారు కార్యాలయం కోర్టు, ట్రెజరీ, పోలీసుస్టేషన్ ఉన్నాయి. ఇది అందుబాటులోకి వస్తే చాలా మంది దాహార్తి తీర్చవచ్చు. ప్రస్తుతం అలంకారప్రాయంగా మాత్రమే ఉంది.

పంటను కాపాడండి : రైతులు


సీఈకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

ముద్దనూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి వస్తున్న బూడిద పంట పొలాలపై పండటంతో పంట నష్టపోతున్నామని రైతులు ఆర్టీపీపీ సీఈ గౌరీపతికి వినతిపత్రం అందించారు. ఆర్టీపీపీలోని సీఈ కార్యాలయంలో బుధవారం ముద్దనూరు మండలం కొసినేపల్లి రైతులు సీఈని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీపీపీ కాంపౌండ్ వాల్ ఆనుకొని తమ పంటపొలాలు ఉన్నాయని, ఆర్టీపీపీ నుంచి బూడిద దుమ్ము విపరీతంగా వచ్చి పంటలపై పడుతోందన్నారు. పంటలను కాపాడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ప్రతాపరెడ్డి, వాసుదేవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెద్దగురయ్య, శ్రీనివాసులు, బాలనాగిరెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న విద్యుత్తు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగులోని ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈ రాజగోపాల్‌కు వినతిపత్రం అందించి వారు మాట్లాడారు. రాష్ట్రంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేతలకు రాయితీ విద్యుత్తు అమలు చేయాలని కోరారు. జమ్మలమడుగు పట్టణంలో విద్యుత్తు సమస్యలపై విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, ఓబన్న, బాలస్వామి, రవి, చౌడం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో సిబ్బందికి సహకరించండి

ప్రొద్దుటూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్ల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడిచెత్త, పొడి చెత్తగా వేరు చేసి సేకరణ నిమిత్తం వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందించేలా ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం విలేజ్ విజిట్‌లో భాగంగా కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె, ఖాదర్‌బాదు, ప్రకాష్‌నగర్, అమృత్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఈవోపీఆర్డీ రామాంజనేయులరెడ్డి, పంచాయతీ సెక్రటరి రామమోహన్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

నీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరిగాయని, ఆ దిశగా నీటి అవసరాలు పెరిగాయని, మంచినీటి సమస్యలు ఎక్కడ వచ్చినా వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్, ఎంపీడీవో సైదున్నీసా అధికారులకు సూచించారు. బుధవారం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబంధించి ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఈవోపీఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఖాజీపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పనపల్లెలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వెంకటరమణ పరిశీలించారు. బుధవారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీని పరిశీలించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, ఉపాధి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కులవృత్తుల వారితో సమావేశం

ఎర్రగుంట్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కులవృత్తుల వారితో ఎంపీడీవో వెంకటరమణయ్య బుధవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదరణ-3 పథకం కింద వారి వృత్తికి అవసరమైన ఆధునిక పరికరాలు పంపిణీ విషయంపై వారి సలహాలను, అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రంతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే పుట్టనా... కసితీరా కుట్టనా...!

- జనావాసాల మధ్య మురుగు నిల్వ
- దోమలు, విషపురుగులతో భయాందోళన
- అధికారులు పట్టించుకోవాలంటూ వినతి

ప్రొద్దుటూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు దాడి చేయడంతో పట్టణ శివారు వాసులు ఆందోళన చెందుతున్నారు. దోమలు, కీటకాలు, విషపురుగులు, సర్పాలతో పొంచి ఉన్న ప్రమాదంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. పంట కాలువలు, ప్రధాన మురుగు కాలువల ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, మురుగు వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చివేశాయి. దీంతో జనావాసాల మధ్య పేరుకుపోతున్న మురుగు తటాకాలతో ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. దోమల నివారణకు చేపట్టే ఫాగింగ్ సక్రమంగా చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది కసితీరా జనాలను కుట్టేస్తున్నాయి.


డీసీఎస్‌ఆర్ కాలనీలో పాచిపట్టిన మురుగు


హౌసింగ్‌బోర్డు కాలనీలో జనావాసాల మధ్య మురుగు

తటాకాలతో ఆందోళన

పట్టణ శివారులో కొత్తపల్లి, గోపవరం పంచాయతీలోని వివిధ కాలనీల్లో మురుగు వ్యవస్థ అధ్వానంగా తయారైంది. కొత్తపల్లె పంచాయతీలో 5 సచివాలయాల పరిధిలో 9,697 కుటుంబాలు, గోపవరం పంచాయతీలో 5 సచివాలయాల పరిధిలో 7,045 కుటుంబాలు ఉన్నాయి. డీసీఎస్‌ఆర్ కాలనీ ప్రాంతాల్లో ప్రధాన మురుగు ప్రవహించే కాలువలు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పూడికల తీతకు పనులు చేయలేని విధంగా ఇరువైపుల ఆక్రమణలు అడ్డు వస్తున్నాయి. దీంతో కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు జనావాసాల మధ్యలో పేరుకుపోవడంతో అక్కడి వారి జీవనం నరకప్రాయంగా మారింది. రెవెన్యూ, పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పాచిపట్టిన మడుగు ఉన్న ఖాళీ స్థలాల సమీపంలో దుర్వాసన, దోమలు, విషజ్వరాలు, విషపురుగుల సంచారంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఈ ప్రాంతంలో ఉర్దూ పాఠశాల ఉండడంతో పిల్లల తల్లిదండ్రులు విషకీటకాలతో ఆందోళన చెందుతున్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో మురుగునీరు నివాసాల మధ్య చేరడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ప్రధాన కాలువ దెబ్బతింది

- కేవీ సురేష్, డీసీఎస్‌ఆర్ కాలనీ



డీసీఎస్‌ఆర్ కాలనీలోని మోడంపల్లె ప్రధాన కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో కాలువ లైనింగ్ దెబ్బతిని జనావాసాల మధ్య మురుగు చేరి పాచిపట్టిన మడుగు పేరుకుపోతోంది. దుర్వాసన, దోమల కారణంగా విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. విషపురుగులతో ప్రజలను హడలెత్తిస్తున్నాయి.

ఫిర్యాదులపై స్పందన కరువైంది

- రాజేశ్వరి, హౌసింగ్‌బోర్డు కాలనీ



ఇళ్ల మధ్యలో పేరుకుపోతున్న మురుగు, ఏపుగా పెరుగుతున్న జంబు, పిచ్చిమొక్కలతో ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. సమస్య పరిష్కారానికి పంచాయతీ అధికారుల దృష్టికి పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన కరువైంది. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి.

పంచాయతీ కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం

ఖాజీపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించినట్లు కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ అసోసియేషన్ వారి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడిగా ఎం.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం

బద్వేలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తొలగించిన మీ సేవ కేంద్రాల సర్వీసులను పునరుద్ధరించడంపై బద్వేలులోని నాలుగు రోడ్ల కూడలిలో ఐటీశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మీ సేవ సంఘం వైస్ ప్రెసిడెంట్ తిరువీధి ప్రసాద్ మాట్లాడుతూ మీ సేవ కేంద్రాలకు సంబంధించిన పలు సేవలను సచివాలయాలకు తరలించడంతో తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. దళిత ప్రజాసంఘాల నాయకులు పిచ్చయ్య, బి.కేశవయ్యలు తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ కేంద్రాల నిర్వాహకులు సంజీవరెడ్డి, రవీంద్రారెడ్డి, కార్తీక్, గోపికృష్ణ, రామ బ్రహ్మచారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిక్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎన్డీఏ నాయకులు

కాశినాయన, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం మండలంలోని జ్యోతిక్షేత్రంలో వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమం అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం వారు జ్యోతిక్షేత్రాన్ని సందర్శించి కాశినాయన, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ జరుగుతున్న పున:నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం లోకేశ్ చిత్రపటానికి ఎన్డీఏ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు బొమ్మన సుబ్బరాయుడు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శశిభూషన్‌రెడ్డి, టీడీపీ నాయకులు సర్పంచ్ యనమల సుధాకర్, చెరుకూరి రవికుమార్, కలసపాడు మండల తెలుగు యువత అధ్యక్షుడు కల్లూరి దుగ్గిరెడ్డి, కోకల బాలిరెడ్డి పాల్గొన్నారు. కాగా శ్రీనివాసులరెడ్డి జ్యోతి పర్యటనలో పర్యటనలో బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి వారి అనుచరగణం కన్పించకపోవడం నియోజకవర్గంలో చర్చనీయంశంగా మారింది.

గ్రామ సంఘం అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు

బ్రహ్మంగారిమఠం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య పరిధిలోని గ్రామ సంఘం అసిస్టెంట్లకు (వీవోఏస్) లోకోస్ యాప్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే గ్రామస్థాయిలో గ్రామ సంఘం పరిధిలోని డ్వాక్రా సంఘాలు అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలు వేసినట్లు ఎల్‌సీసీ శ్రీనివాసులు తెలిపారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్లు భాస్కర్, ఎస్.బాలయ్య, డి.నారాయణ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం'

బద్వేలు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ ఆరోపించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రసాద్, వెంకటేశ్, బ్రహ్మయ్య, ఇబ్రహీం, హరి పాల్గొన్నారు.

దేవస్థాన భూములకు కొలతలు

మైదుకూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని భీమేశ్వర దేవస్థానం పరిధిలోని భూములను బుధవారం ఎండోమెంట్, రెవెన్యూ అధికారులు కొలతలు నిర్వహించారు. సర్వే నెంబర్లు 1031, 1052-ఏ, 1052-బి, 1052-సీ, 1054-ఏ, 1054-బి, 1087ఏ నెంబరు గల భూముల్లో కొంత భాగం సర్వే పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్, ఈఓ ప్రసాద్‌రావు, తిరుపతికి చెందిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పోరుమామిళ్లలో జరుగుతున్న ఉపాధి పనులు తనిఖీ చేశారు. మస్టర్లు తప్పనిసరిగా ప్రతి రోజూ నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

సెక్రటరీపై చర్యలు తీసుకోవాలి : వీఆర్వోలు


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

ముద్దనూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొందలకుంట సచివాలయ సెక్రటరీ మౌలాన అదే సచివాలయంలో రెగ్యులర్ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న చందన అనే మహిళను ఉద్దేశ్యపూర్వకంగా అసభ్యకర పదజాలంతో వేధిస్తున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని మండల వీఆర్వోలు బుధవారం తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వీఆర్వో చందన మాట్లాడుతూ తాను బొందలకుంట సచివాలయ పరిధి రెగ్యులర్ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నానని, గత నెలలో కుంభమేళాకు వెళుతూ తహసీల్దారు, సెక్రటరీ అనుమతితో 9 రోజులు సెలవు పెట్టానన్నారు. అయితే దాన్ని సెక్రటరీ ఫార్వడ్ చేయాల్సి ఉండగా పట్టించుకోలేదని ఆరోపించారు. తనను ఉద్దేశ్యపూర్వకంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి, ఎంపీడీవో ముకుందారెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డిని వివరణ కోరగా.. వీఆర్వో చందన తన అనుమతి తీసుకొని 9 రోజులు సెలవుపై వెళ్లింది. అయితే దీనిపై సెక్రటరీ మౌలాన ఉద్దేశ్యపూర్వకంగా వేధిస్తున్నారని వీఆర్వోలు అంతా వచ్చి తనకు ఫిర్యాదు చేశారు. పూర్తి విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా సచివాలయ సెక్రటరీ మౌలానను వివరణ కోరగా... ఫిబ్రవరిలో 9 రోజులు సెలవు కావాలని వీఆర్వో చందన తనకు తెలియజేశారని, అయితే ఎక్కువ రోజులు సెలవు కావాలంటే తహసీల్దారు, ఎంపీడీవో అనుమతి తీసుకోవాలని తెలిపానని, ప్రొసీడింగ్ లెటర్ లేనందున ఫిబ్రవరి నెలకు సంబంధించి జీతం పెట్టలేదన్నారు. ఆమెను అసభ్యకర పదజాలంతో దూషించలేదని తెలిపారు.

'జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేపట్టాలి'

బద్వేలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టాలని మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎస్సీ మాల మహాసభ నాయకత్వం ఆధ్వర్యంలో ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం సుబ్బరాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వహించిన కేబినేట్ సమావేశంలో జనాభా ప్రాతిపదికన కులగణన సర్వే నిర్వహించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాల మహానాడు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో- బైకు ఢీ

ప్రొద్దుటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాధానగర్‌లో ఆటో-బైకు ఢీకొన్న ఘటనలో పులివెందుల కానిస్టేబుల్ సుమన్ గాయపడ్డారు. విధులు ముగించుకొని సుమన్ బైకులో దువ్వూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ఘటన జరిగి గాయాలపాలయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

కొండాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూమిని కొనుగోలు చేయడానికి డబ్బులిచ్చినా రిజిస్ట్రేషన్ మరొకరికి చేయించి మోసం చేసిన ముగ్గురిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు.. మండలంలోని గండ్లూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనంతపురం జిల్లా యల్లనూరు మండలం కృష్ణాపురంలో అమరనాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి అనే ముగ్గురి వద్ద 17 ఎకరాల భూమిని రూ.60 లక్షలకు కొన్నాడు. ఇందుకు సంబంధించి అగ్రిమెంట్ కూడా రాయించుకున్నాడు. కానీ ఆ భూమిని మరొకరికి అమ్మి రిజిస్ట్రేషన్ చేయించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పై ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

పోరుమామిళ్లలో భారీ ర్యాలీ

పోరుమామిళ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి జ్యోతి క్షేత్రానికి రానున్న సందర్భంగా పోరుమామిళ్లలో టీడీపీ నాయకుడు చెరుకూరి రవికుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఆయన కమ్మవారిపల్లె సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపం నుంచి బైకులు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటు సభ్యులు సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, మాజీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డితో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాత

ముద్దనూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్టాండు ఆవరణంలో బుధవారం స్టేట్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు సైబర్ నేరాలపై కళాజాత కార్యక్రమం నిర్వహించారు. రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్‌బీఐ మేనేజర్ చలపతి సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

ముద్దనూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూములను రీసర్వే చేయిస్తున్నదని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి కొసినేపల్లి, వేల్పుచర్ల గ్రామాల్లో బుధవారం రైతులకు అవగాహన కల్పించి, ర్యాలీ చేపట్టారు. ప్రతి రైతు భూములను కొలతలు వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి

రాజుపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొట్టాల గ్రామానికి చెందిన తోకల మోహన్ అనే వ్యక్తికి చెందిన ఆరు పొట్టేళ్లను కుక్కలు దాడి చేసి చంపేశాయి. బాధితుడు మాట్లాడుతూ ఉపాధిగా పొట్టేళ్లను తెచ్చుకుని పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నానని, అనుకోకుండా రాత్రి కుక్కలు వాటిపై దాడి చేయడంతో మృతిచెందాయని వాపోయాడు. తనకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

26న కడప ఉక్కుపై సదస్సు

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో హోంలో ఈ నెల 26న కడపఉక్కు, ఆంధ్రుల హక్కు అన్న అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, విశ్వనాథ్, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు

కొండాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకల పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. పాఠశాలకు చెందిన 77 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తునట్లు ఆమె తెలిపారు. వీరంతా వివిధ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారు. వీరందరికీ ఉచిత బస్సును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు కులసంఘాల సమావేశం

అట్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ కులాలైన రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, కుమ్మరి, తదితర సంఘం నాయకులకు ఇచ్చే ఆదరణ పరికరాలపై గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా టైలరింగ్ నేర్చుకోదలచిన వారు ఆయా సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అవకతవకలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగార్జున ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, అవగాహన కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.